సాక్షి
అనకాపల్లి
సోమవారం । 5 । ఆగస్టు । 2024



వరి నారుమడిలో ఉల్లికోడు

వరి నారుమడిలో ఉల్లికోడు తెగులు వచ్చే అవకాశం ఉన్నందన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్త సూచించారు.

8లో



మెరి'శారీ'లా..

విశాఖ బీచ్‌రోడ్డులోని హ్యాండ్లూం శారీ వాక్ నిర్వహించారు. సుమారు 10వేలు మంది ఈ వాక్‌లో పాల్గొన్నారు.

8లో



ఉచిత ఇసుక హామీని నెరవేర్చాలి

ఉచితంగా ఇసుకను పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం హామీని నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు డిమాండ్ చేశారు.

8లో

న్యూస్‌రీల్

పాఠశాలల సమస్యలు పట్టని ప్రభుత్వం



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించడంపై దృష్టిపెట్టకపోవడం అన్యాయమని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నంబర్ 117ను రద్దుచేసిన తరువాత పాత జీవో 53 ప్రకారం ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీపై కూటమి ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి,ఉపాధ్యక్షులు కట్టా శ్రీను,గాయత్రి, జిల్లాకార్యదర్శులు దొగ్గా శ్రీను,ఎ.ప్రకాష్, కోశాధికారి జోగా రాజేష్ పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధిలో 'కూటమి' విఫలం



మాట్లాడుతున్న రామ్మోహన్

అనకాపల్లి: రాష్ట్రంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్ర విద్యార్థులతో పోటీపడాలంటే ప్రాథమిక స్థాయి నుంచి నైపుణ్యాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగాఉన్న ఉపాధ్యా యుల పోస్టులను వెంటనే భర్తీచేసి, నాణ్యమైన విద్యను అందించాలని, అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామడి రమణ, గిడుతూరు గీతాకృష్ణ, జిల్లా నాయకులు కేశవ, శ్రీను, వెంకటేష్, కృపానంద్, దివాకర్, జనార్ధన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు 6న నోటిఫికేషన్ జారీ

మహారాణిపేట(విశాఖ): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం ఈనెల 6వ తేదీన నోటిఫికేషన్ వెలువడనుంది. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీ మారడంతో ఆయనపై అనర్హత వేటు పడింది. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మంగళవారం ఎన్నికల అధికారి హోదాలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 14న స్క్రూటినీ, 16న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. 30వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుంది.

ఎన్‌సీసీ క్యాడెట్ల బాక్సింగ్ పోటీలకు దిమిలి విద్యార్థి



ఎన్‌సీసీ క్యాడెట్ ధనుష్

అచ్యుతాపురం: ముంబయిలో ఈ నెల 13న నిర్వహించనున్న ఎన్‌సీసీ క్యాడెట్ల బాక్సింగ్ పోటీలకు రాంబిల్లి మండలం దిమిలి విద్యార్థి అనగాని ధనుష్ ఎంపికయ్యాడు. ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ధనుష్ విశాఖపట్నం గ్రూప్ నుంచి ఎంపికైనట్టు ప్రశాంతి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిస్తే ఇండియన్ నేవీలో నేరుగా ఉద్యోగం పొందవచ్చు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టు భర్తీకి ఎంఎస్సీ 55 శాతం ఉత్తీర్ణత కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ, ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ అర్హత గల వారికి కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ పోస్టు భర్తీకి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపీఈడీ 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు అర్హులని తెలిపారు. ఈ నెల 7న దరఖాస్తులను సమర్పించాలని తెలి పారు. 9న ఇంటర్వ్యూకు హాజరు కావాలని చెప్పారు.

గాడి తప్పిన బడి

ప్రతి ఒక్కరూ చదువుకోవాలని తపించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యార్థులకు చదువు భారం కావద్దనే ఉద్దేశ్యంతో ఎన్నో పథకాలను అమలు చేశారు. అంతకు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన పాఠశాలలను గాడిలో పెట్టారు. నాణ్యమైన ఆహార పదార్థాలతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారు. పాఠశాలల ప్రారంభం నాడే అందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పరిస్థితి తారుమారైంది. బడి గాడి తప్పింది. జిల్లాలోని చాలా బడుల్లో విద్యార్థులకు షూస్, బ్యాగులు అందలేదు. విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ప్రోత్సహించాల్సింది పోయి... ఉన్న పాఠశాలలను ప్రభుత్వం మూసివేస్తోంది. ఇంగ్లిష్ మీడియం అమలు చేయకపోవడంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను మళ్లీ ప్రైవేట్ పాఠశాలలకు మారుస్తున్నారు. మొత్తం మీద విద్యా వ్యవస్థ తిరోగమనంలో పయనిస్తోంది.



దేవరాపల్లి మండలం యండపల్లిపాలెంలో మూతపడిన ప్రాథమిక పాఠశాల

- తిరోగమనంలో విద్యావ్యవస్థ
- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థులు
- ఇంగ్లిష్ మీడియం లేదని ప్రైవేట్ పాఠశాల్లో చేరుతున్న పిల్లలు
- విద్యార్థులు లేకపోవడంతో నాలుగు పాఠశాలలు మూత
- అరకొరగా విద్యాకానుక కిట్ల పంపిణీ
- చాలామందికి నేటికీ అందని షూస్
- నాణ్యత లేని మధ్యాహ్న భోజనం
- 'తల్లికి వందనం' పథకానికి ఎగనామం
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇక్కట్లకు గురవుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



బొట్టవానిపాలెంలో ఏకోపాధ్యాయ పాఠశాల

సాక్షి, అనకాపల్లి: గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ అభివృద్ధి పథంలో దూసుకుపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది రోజులకే పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్యను దూరం చేస్తోంది. పాఠశాలలు తెరిచి రెండు నెలలు కావస్తున్నా వాటి నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించలేదు. మధ్యాహ్న భోజన పథకం అరకొరగా అమలవుతోంది. విద్యాకానుక కిట్లు పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. ఇంటిలో ఎంతమంది పిల్లలు బడికి వెళితే అందరికీ 'తల్లికి వందనం' పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు మాటమార్చేశారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎక్కువ.. విద్యార్థులు తక్కువగా ఉండగా, మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు గణనీయంగా తగ్గిపోయాయి. తమ పిల్లలను ఇంగ్లిష్ మీడియంలో చదివించాలని భావించిన తల్లిదండ్రులంతా ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 1,06,616 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుత విద్యా సంవత్సరం(2024–25)లో తాజా గణాంకాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో గల పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ 96,612 మంది విద్యార్థులున్నారు. సుమారు 10 వేల మంది వరకూ విద్యార్థులు తగ్గినట్టు తెలుస్తోంది. యు డైస్ ప్లస్ పోర్టల్‌లో విద్యార్థుల నమోదు ప్రక్రియ కొనసాగుతున్నందున కొద్దిగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, గత ఏడాది మార్కును చేరుకోవడం కష్టమేనని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పరిస్థితులు ఇలానే ఉంటే, భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమేనని విద్యారంగ నిపుణులు అంటున్నారు.

'సాక్షి' క్షేత్ర స్థాయి పరిశీలనలో వెల్లడైన వివరాలు

- మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండల పరిధిలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత నాలుగు ప్రాథమిక పాఠశాలలను మూసివేశారు. ఇంగ్లిష్ మీడియం అమలు చేయకపోవడంతో పలువురు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడి ప్రైవేటు పాఠశాలల బాట పట్టారు. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంలో దేవరాపల్లి మండలంలోని రైవాడ పంచాయతీలో బేతపూడి ఎంపీపీ స్కూల్, నాగయ్యపేట పంచాయతీలోని సీతంపేట స్కూల్, మారేపల్లి పంచాయతీ శివరామ చేనులపాలెం పాఠశాల, కె.ఎం.పాలెం పంచాయతీలో యండలపల్లి పాలెం ఎంపీపీ స్కూల్ మూతపడ్డాయి.
- యలమంచిలి, అచ్యుతాపురం, మాడుగుల, కె.కోటపాడు మండల పరిధిలో బ్యాగ్‌లు ఇవ్వలేదు.
- యలమంచిలి నియోజవర్గం రాంబిల్లి మండలంలో రాంబిల్లి జెడ్పీ హైస్కూల్, కేజీబీవీ స్కూల్, పంచదార్ల జెడ్పీ హైస్కూల్, కొత్తూరు హైస్కూల్, దిమిలి, మూలజంప హైస్కూల్, లాలం కోడూరు, వెంకటాపురం ఎంపీయూపీ స్కూల్, రాజకోడూరు ఎంపీయూపీ స్కూల్, పెద కలవలాపల్లి, అప్పన్నపాలెం, మురకడ, గోకివాడ పాఠశాలల్లో 30 శాతం విద్యా కానుక కిట్లలో షూష్, 10 శాతం మంది విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేయలేదు. సీతపాలెం ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులు తక్కువగా ఉండడంతో కృష్ణంపాలెం ఎంపీపీ స్కూల్‌కు బదిలీ చేశారు. అక్కడ విద్యార్థులను సమీపంలో ఉన్న లాలం కోడూరు పంపిస్తున్నారు.
- అచ్యుతాపురం మండలంలో ఉప్పవరం ఎంపీపీ స్కూల్‌లో ముగ్గురు విద్యార్థులుండగా ఇద్దరు టీచర్లు పనిచేస్తున్నారు. గత ఏడాది ఇక్కడ 30 మందికిపైగా విద్యార్థులుండేవారు. అచ్యుతాపురం మండలం కొనెంపాలెం ఎంపీపీ స్కూల్‌లో 14 మంది, మునగపాక మండలం మంగళవరపుపేట ఎంపీపీ స్కూల్‌లో నలుగురు విద్యార్థులున్నారు. అచ్యుతాపురం మండలంలో సుమారు 310 వరకూ విద్యార్థులు ఈ ఏడాది తగ్గారు.
- మాడుగుల మండలంలో ఏడు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పోతలపూడి ఎంపీపీ స్కూల్‌లో ఐదు గురు విద్యార్థులు, తాటిపర్తి, తాటిపర్తి శివారు లక్ష్మీపేట ఎంపీపీ స్కూల్, అవురువాడ ఎంపీపీ స్కూళ్లలో 10 మంది లోపే విద్యార్థులున్నారు. బి.జాలంపల్లి, వాడపాడు, బిల్లలపాలెం ఎంపీపీ స్కూళ్లలో 15 మంది లోపు విద్యార్థులున్నారు. ఈ పాఠశాలల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కనీసం ఒక్కో పాఠశాలలో 30 నుంచి 50 వరకూ విద్యార్థులు ఉండేవారు. వారికి తగ్గట్టుగా ఇద్దరు ఉపాధ్యాయులు బోధించేవారు. కానీ ప్రస్తుతం ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయి.
- కె.కోటపాడు మండలం పరిధిలో మల్లంపాలెం, బొట్టవానిపాలెం, ఎ.భీమవరం, కొత్తభూమి, శృంగవరం, లంకవానిపాలెం, కొత్త అగ్రహారం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో ఏకోపాధ్యాయులతో పాఠశాలల నిర్వహణ సాగుతోంది.
- వై.బి.అగ్రహారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగ్గా లేదని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి.
- చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలంలో 25 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. వీటిలో కశిరెడ్డిపాలెం, కె.అర్థసరం, భోగాపురం ఎంపీపీ స్కూళ్లలో 15 మందిలోపు విద్యార్థులున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో సీతయ్యపేట జెడ్పీ హైస్కూల్‌లో గతంలో 500కు పైగా విద్యార్థులుండేవారు. ఇప్పుడు 300 మంది మాత్రమే ఉన్నారు, వడ్డాది హైస్కూల్లో 700 మంది విద్యార్థులకు పైగా ఉండేవారు. కానీ ప్రస్తుతం 600 మంది ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య తగ్గిన నియోజకవర్గాలివే..

నియోజకవర్గం	తగ్గిన విద్యార్థుల సంఖ్య
పాయకరావుపేట	692
యలమంచిలి	1,110
చోడవరం	1,620
మాడుగుల	1,815
నర్సీపట్నం	1,651
అనకాపల్లి	1,445
సబ్బవరం, పరవాడ మండలాల్లో	630

అరకొరగా విద్యాకానుక కిట్లు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం ప్రారంభం తొలిరోజునే జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేసేవారు. కానీ బడులు తెరిచి సుమారు రెండు నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వంలో వీటి పంపిణీ ఇప్పటికీ అరకొరగానే ఉంది. జిల్లాలో 77,567 మంది విద్యార్థులకు గత ప్రభుత్వ హయాంలోనే కానుకలన్నీ వచ్చాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించినవి కావడంతో వీటి పంపిణీపై కూటమి నేతలు ఆటంకాలు సృష్టిస్తున్నారు. చాలా మంది విద్యార్థులకు కొలతలు సరిగ్గా లేవని షూస్ ఇవ్వలేదు. బూట్లు లేకుండానే విద్యార్థులు బడికి వస్తున్నారు. జగనన్న విద్యాకానుకను స్టూడెంట్ కిట్‌గా పేరు మార్పు చేసిన కూటమి ప్రభుత్వం వీటి పంపిణీ విషయంలో మాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు అంటున్నారు. జిల్లాలో మొత్తం 96,612 మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 42,208 మాత్రమే వచ్చాయి. ఇందులో షూస్, బ్యాగ్‌లు మినహా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బెల్టు, యూనిఫాంలు అందరికీ పంపిణీ చేశారు.

నాణ్యతకు తిలోదకాలు..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మధ్యాహ్నం భోజన పథకం పేరును డొక్కా సీతమ్మ భోజన పథకంగా మార్పు చేశారు. ఆర్భాటంగా పేరు మార్చి, నిర్వహణను గాలికి వదిలేశారు. చాలా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సరైన సిబ్బందిని నియమించకపోవడం, గత ప్రభుత్వ హయాంలో ఉన్న వంట కార్మికులను తొలగించి కొత్తవారిని తీసుకోవడంతో వారు ఉడికీఉడకని అన్నాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్నారు. దొడ్డి బియ్యంతో పలావ్, పులిహోర వండి పెడుతుండడంతో చాలా పాఠశాలల్లో 60 శాతం మంది విద్యార్థులు మాత్రమే మధ్యాహ్న భోజనం తింటున్నారు. పరిశుభ్రత విషయంలోనూ తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

- జిల్లాలో 1,406 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలవుతోంది. వీటిలో 1,038 ప్రాథమిక, 151 ప్రాథమికోన్నత, 217 హైస్కూళ్లు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 88,031 మంది విద్యార్థులు చదువుతుండగా, 6,449 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.



- కశింకోట, మునగపాక, చీడికాడ, నర్సీపట్నం, రావికమతంలలో గల ఐదు ఏపీ మోడల్ పాఠశాలల్లో 3,146 మంది విద్యార్థులు చదువుతుండగా, 90 మంది బోధనా సిబ్బంది ఉన్నారు. 20 కేజీబీవీ పాఠశాలల్లో 5,435 మంది విద్యార్థులున్నారు.

గుండెలదిరినై..

- ఉదయం 6.30 గంటలకు రైల్వే స్టేషన్‌కు వచ్చిన కోర్బా–విశాఖ ఎక్స్‌ప్రెస్
- 9.40 గంటలకు అగ్నికీలల్లో బూడిదైన బీ–7, మరో రెండు కోచ్‌లు
- ప్రయాణికులు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న విశాఖ
- పవర్ సప్లయ్ లేకపోయినా ప్రమాదమెలా జరిగింది?
- ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్
- నేడు ఆర్‌డీఎస్‌వో, ఐసీఎఫ్ బృందాల పరిశీలన



ఆగిఉన్న కోర్బా ఎక్స్‌ప్రెస్ కోచ్‌లలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, రైల్వే సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం : సాగరాన్ని చీల్చుకుంటూ.. సూరీడు రాకతో విశాఖ నిద్రలేచింది. నిరంతరం సందడిగా ఉండే వాల్తేరు రైల్వేస్టేషన్ ఎప్పటిలాగానే ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. అప్పుడే నాలుగో నంబర్ ప్లాట్‌ఫారానికి వచ్చిన కోర్బా–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రయాణికులు దిగి ఇళ్లకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం మళ్లీ తిరుపతి వెళ్లేందుకు రెడీ చేయాలనే ఉద్దేశంతో సిబ్బంది రైలును శుభ్రం చేస్తున్నారు. ఉదయం 9.40 గంటలకు కలకలం మొదలైంది.. బీ–7 థర్డ్ ఏసీ కోచ్ నుంచి పొగలు వస్తున్నట్లు పహారా కాస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది గుర్తించారు. కోచ్ దగ్గరికి సిబ్బంది చేరుకునేలోపే.. మంటలుగా చెలరేగి కోచ్ మొత్తం వ్యాపించాయి. 5వ నంబర్ ప్లాట్‌ఫాం వద్ద రైలు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలు ఆర్పేందుకు యత్నించారు. కానీ ఫలితం లేదు. 10.10 గంటలకు ఫైర్ బ్రిగేడ్స్ చేరుకున్నాయి.

ఇంతలోనే బీ–7కి ఇటు అటు ఉన్న బీ–6, ఎం–1 కోచ్‌లకు మంటలు వ్యాపించేశాయి. ఓ వైపు అగ్నిమాపక సిబ్బంది, మరోవైపు ఆర్‌పీఎఫ్ సిబ్బంది మంటల్ని అదుపులోకి తీసుకొచ్చేందుకు శ్రమించారు. దాదాపు 2 గంటల తర్వాత మంటలు పూర్తిగా అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగినప్పుడు రైలులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

పవర్ లేనప్పుడు ప్రమాదమెలా జరిగింది?

ఉదయం 6.30 గంటలకు కోర్బా–విశాఖపట్నం (18517) ఎక్స్‌ప్రెస్ విశాఖ చేరుకుంది. 7.30 గంటలకు ట్రైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కోచింగ్ డిపోకు ఈ ఖాళీ రైలును పంపించే ముందు.. ఏసీ కోచ్‌ల్లో ఉన్న బ్లాంకెట్స్ తీసివేయడం, లైట్లు, ఫ్యాన్స్ స్విచ్‌లు ఆపడం, స్లీపర్, జనరల్ కోచ్‌ల్లో విండో గ్లాస్‌లు దించే పని ప్రారంభించారు. ప్రమాదం జరిగింది ఉదయం 9.40 గంటలకు. అంటే దాదాపు రెండు గంటల ముందే ట్రైన్‌కు పవర్ సప్లయ్ నిలిచిపోయింది. కానీ బీ–7 థర్డ్ ఏసీ కోచ్ నుంచి మంటలు వ్యాపించడంపై అందర్లోనూ అనుమానాలు కలుగుతున్నాయి. షార్ట్ సర్క్యూట్ అయ్యే ఛాన్స్‌లేదు. కానీ అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో అధికారులకు అంతు చిక్కడం లేదు. చివర్లో ఎవరైనా ఆకతాయిలు దిగినప్పుడు సిగరెట్ తాగి పడేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కొన్ని ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో ఇప్పటికే సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ ఈ ఎక్స్‌ప్రెస్‌లో మాత్రం సీసీ కెమెరాలు లేకపోవడంతో అధికారులు లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంటుంది.

మెయింటెనెన్స్ లోపమా.?

వాస్తవానికి ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల మెయింటెనెన్స్ ఈ మధ్య సరిగా ఉండటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ సంస్థకు ఈ బాధ్యతలు అప్పగించినప్పటి నుంచి కోచ్‌ల పరిశుభ్రత, నిర్వహణ విషయంలో కాస్తా అలసత్వం ప్రదర్శిస్తున్నారనీ.. దీనిపై ఫిర్యాదులు చేస్తున్నా రైళ్లలో ఉండే ప్రైవేట్ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి. విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ఉదాసీనంగా ఉండటం వల్లే లోపల షార్ట్ సర్క్యూట్ జరిగి నెమ్మదిగా మంటలు వ్యాపించి ఉంటాయేమోనన్న వాదనా వినిపిస్తోంది..

నేడు దర్యాప్తు బృందాల రాక

ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై ఇంత వరకూ ప్రాథమిక అంచనాకు రాలేదని వాల్తేరు డివిజన్ అధికారులు చెబుతున్నారు. డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, జేసీ మయూర్ అశోక్, ఏడీఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహూ తదితరులు ఘటనా స్థలికి చేరుకొనిసమీక్షించారు. ప్రమాదంపైవిచారణనిర్వహించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. క్లూస్ టీమ్‌ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. లక్నోలోఉన్న రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్(ఆర్‌డీఎస్‌వో),చెన్నైనుంచి ఇంటిగ్రల్‌కోచ్‌ఫ్యాక్టరీ(ఐసీఎఫ్)బృందాలుసోమవారం వచ్చి ఆధారాలు సేకరించనున్నాయి. ప్రమాదం పైవిచారణ చేపట్టేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌అధికారులువిశాఖకుసోమవారం రానున్నారు.

ఉత్సాహంగా మారథాన్



మారథాన్ పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న రాంబాబు, తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదిలో అమ్మ హెల్పింగ్ హార్ట్స్ నిర్వహించిన మారథాన్ పోటీలకు యువకుల నుంచి విశేష స్పందన వచ్చింది. యువత చెడుదారి పట్టకుండా ఉండేందుకు వారిలో చైతన్యం తీసుకురావాలన్న సంకల్పంతో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మారథాన్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు దొండా రాంబాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు,ఎస్ఐ డి.ఈశ్వరరావులు మారథాన్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. రెండున్నర కిలోమీటర్ల పరుగు పోటీలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నలుగురు విజేతలకు బహుమతులు,10 మందికి కన్సొలేషన్ బహుమతులు, మారథాన్‌లో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, నాయకులు దొండా గిరిబాబు,దాడి చిన గోవింద,నరేష్,శ్రీరామూర్తి,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి పీచు స్టాక్ పాయింట్‌లో అగ్నిప్రమాదం

రూ. 20 లక్షల విలువ చేసే పీచు దగ్ధం

రాంబిల్లి (యలమంచిలి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో రాధా ఫైబర్స్ పరిశ్రమకు చెందిన స్టాక్ పాయింట్‌లో నిల్వ చేసిన కొబ్బరి పీచు దగ్ధమైంది. యలమంచిలి అగ్నిమాపకశాఖాధికారి రాంబాబు, పరిశ్రమ యజమాని పిన్నమరాజు రాధా సుందర సుబ్బరాజు తెలిపిన వివరాలు ... మండల కేంద్రం రాంబిల్లిలో ఉన్న రాధా ఫైబర్స్ కొబ్బరి పీచు పరిశ్రమకు చెందిన సుమారు రూ.20 లక్షలు విలువ చేసే పీచును స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఒక ఖాళీ స్థలంలో నిల్వ చేశారు. కొబ్బరి పీచు మీద ఉన్న విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం నిప్పు రవ్వలు కిందపడడంతో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.20లక్షల విలువ చేసే ఎండబెట్టిన కొబ్బరిపీచు దగ్ధమైంది. సమాచారం అందుకున్న యలమంచిలి అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. పరిశ్రమ యజమాని సుబ్బరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దగ్ధమవుతున్న కొబ్బరిపీచు

క్లుప్తంగా

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం



ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన గేదెల అరుణ(ఫైల్)

దేవరాపల్లి : మండలంలోని రైవాడ పంచాయితీ శ్రీరాంపురం గ్రామానికి చెందిన గేదెల అరుణ(30) తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్టు స్థానిక ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు. అదృశ్యమైన అరుణ భర్త గేదెల అప్పలనాయుడు ఆదివారం రాత్రి తమకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. స్థానిక ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పలనాయుడుకు అదే గ్రామానికి చెందిన అరుణతో 2011లో వివాహం జరిగింది. వీరికి కుమార్తె మేఘన, కుమారుడు భార్గవనాయుడు ఉన్నారు. గతంలో వీరి మధ్య మనస్పర్ధలు తలెత్తగా పోలీస్ స్టేషన్‌కు రావడంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అయితే తాజాగా ఆదివారం ఉదయం భర్త ఆటో వేసుకొని వెళ్లిపోయిన తర్వాత అరుణ తన ఇద్దరు పిల్లలను తీసుకొని ఇంటి నుండి బయటకు వెళ్లిపోయింది. వీరి ఆచూకీ కోసం చుట్టు పక్కల గ్రామాలతో పాటు బంధువులను ఆరా తీయగా ఫలితం లేకపోవడంతో భర్త అప్పలనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నదిలో మునిగి వ్యక్తి మృతి



తూటిపాల వద్ద సర్పానదిలో లభ్యమైన శ్రీను మృతదేహం

మాకవరపాలెం : మద్యం మత్తులో నదిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. రోలుగుంట మండలం పడాల పాలెం గ్రామానికి చెందిన సేనాపతి శ్రీను (30) శనివారం రాత్రి ఈ గ్రామ సమీపంలో ఉన్న సర్పానదిలో మద్యం మత్తులో దిగడంతో కాలుజారి నదిలో కొట్టుకుపోయాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం మండలంలోని తూటిపాల సమీపంలో ఉన్న సర్పానదిలో శ్రీను మృతదేహం లభ్యమైంది. దీంతో స్థానికులు అందించిన సమాచారంతో ఎస్‌ఐ రామకృష్ణారావు మృతదేహాన్ని పరిశీలించి, పడాల పాలెం గ్రామ వాసిగా గుర్తించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ శ్రీనుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, మద్యానికి బానిస కావడంతో గత ఐదేళ్లుగా భార్య దూరంగా ఉందని తెలిపారు.

మెరి'శారీ'లా..



చీరతో 'షి'ంగారం



మహిళానందం



ఫ్యాషన్ వాక్..

- సాగరతీరంలో హ్యాండ్లూం శారీ వాక్
- పదివేల మంది హాజరు
- అదిరిన ఫ్యాషన్ వాక్

సింగారమనే దారంతో చేసి, ఆనందమనే రంగులను అద్ది, మమకారమనే మగ్గంపై నేసిన చీరకు తిరుగేముంది? చీర పవిత్రతను సూచిస్తుంది, మన సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తుంది, దెబ్బ తగిలి రక్తం కారితే సర్రున చిరిగేది..అమ్మమ్మ కట్టే ముతక చీర. ఏడ్చే కళ్లని తుడిచి ఓదార్పును అందించేది.. ఆత్మీయత నిండిన అమ్మ చీర. ప్రేమాభిమానాల్ని, వెలకట్టలేని అనురాగాన్ని అపురూపంగా మూట కట్టి ఇచ్చేది.. ఆడపడుచుకు పెట్టే పట్టుచీర. ఇంతటి చీర ప్రాముఖ్యతను విశాఖ మహిళలు మరోసారి చాటిచెప్పారు.

బీచ్‌రోడ్డు : ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని హ్యాండ్లూం శారీ వాక్‌ను హోంమంత్రి అనిత ప్రారంభించగా పదివేల మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ చీరకట్టు అనాదిగా వస్తున్న సంప్రదాయమని, చీరలో అమ్మతనం, కమ్మతనం ఉంటుందన్నారు. చేనేత కార్మి కులను ప్రోత్సహిస్తూ శారీ వాక్ నిర్వహించడం అభినందనీయమన్నారు. చేనేత కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకుంటామన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ చీరకట్టు మన దేశ సంప్రదాయమన్నారు. అటువంటి చీరకట్టుకొని సుమారు 10వేలు మంది ఈ వాక్‌లో పాల్గొనటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వీఎస్ఈజెడ్ అధికారి రోషిణి, ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ సభ్యులు దొరబాబు, డాక్టర్ పద్మశ్రీ,వినయ్, శేఖర్, లలిత శ్రీనువాస్ తదితరులు హోం మంత్రి వంగలపూడి అనితను ఘనంగా సత్కరించారు. పలు కాలేజీల విద్యార్థినులు, పలు సంస్థల ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో శారీ వాక్‌లో పాల్గొన్నారు. చీర గొప్పతనం తెలియజేశారు. అనంతరం చేనేత కార్మికులకు అండగా ఉండేందుకు వారు రూపొందించిన వస్త్రాలను ధరించి ఫ్యాషన్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి అడుగులు చీరను ప్రదర్శించారు.

ఉచిత ఇసుక హామీని నెరవేర్చాలి..

- సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికుల్ని ఆదుకోవాలి
- ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుకను పంపిణీ చేసి, ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం డిమాండ్ చేశారు. స్థానిక వేల్పుల వీధిలో భవన నిర్మాణ కార్మికులతో ఆదివారం ప్రభుత్వ తీరును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఏడేళ్లుగా చనిపోయిన భవన నిర్మాణ కార్మికులకు చెల్లించాల్సిన బీమా పరిహారం చెల్లించలేదని, దాన్ని వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల క్లెయింలు సుమారు 40 వేలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సత్వర పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులకు అందాల్సిన ప్రసూతి ఖర్చులు, పిల్లల వివాహ కానుకలు వెంటనే చెల్లించాలని కోరారు. అనకాపల్లిలో ఇసుక ర్యాంపును ఏర్పాటు చేయాలన్నారు.

అనకాపల్లిని అద్భుతంగా అభివృద్ధి చేస్తాం

- ఎంపీ సీఎం రమేష్



మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేష్

తుమ్మపాల: ఐదేళ్ల పాలనలో అనకాపల్లిని అద్భుతంగా అభివృద్ధి చేస్తామని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. అనకాపల్లి నుంచి రాజమహేంద్రవరం వరకు జాతీయ రహదారిని ఆరు లైన్లగా అభివృద్ధి చేసేందుకు ఈ నెలాఖరులోనే టెండర్లకు ఆహ్వానం పలుకుతున్నట్లు చెప్పారు. పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తుని నుంచి నర్సీపట్నం, చోడవరం, మాడుగుల మీదుగా విజయనగరం జిల్లా కొత్తవలస వరకు రహదారి సర్వేకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారన్నారు. చోడవరం, మాడుగుల ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు అనువైన స్థలాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. హైడ్రోజన్ గ్రీన్ అమ్మోనియా పరిశ్రమలు తీసుకొచ్చేలా చర్చలు జరుపుతున్నామన్నారు. అనకాపల్లి రైల్వేస్టేషన్‌ను మోడ్రన్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కోసం నిధులు సమీకరించి వచ్చే రెండు మూడేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ నుంచి అనకాపల్లికి నేరుగా రావడానికి ఆరు లైన్ల రహదారి ఏర్పాటు కోసం దాదాపు 9 ఫ్లైఓవర్లు నిర్మించేలా నివేదిక తయారైందని, రూ.1200 కోట్లతో టెండర్లు పిలవడానికి ఆలోచన చేస్తున్నామన్నారు. టీడీపీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థి బరిలో ఉంటారని, నాయకులతో చర్చలు జరిపామని, సీఎం చంద్రబాబు అభ్యర్థిని ప్రకటిస్తారని తెలిపారు.

స్థానికతపై మాట్లాడే హక్కు ఎల్లో గ్యాంగ్‌కు లేదు

- టీడీపీలో ఎంపీలు, ఎమ్మెల్యేలు స్థానికేతరులే
- ఉమ్మడి విశాఖ జిల్లాలో పోటీకి బొత్స అర్హుడే
- కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ



నక్కపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఎంపిక చేయడంపై ఎల్లో గ్యాంగ్ చేస్తున్న విమర్శలు సిగ్గు చేటని పార్టీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో విజయనగరం జిల్లా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒక భాగమన్నారు. 1978లో వేరు పడిందన్నారు. బొత్స విశాఖ జిల్లా అల్లుడన్నారు. ఆయన ఉమ్మడి విశాఖజిల్లాలో ఎక్కడ నుంచైనా పోటీ చేసేందుకు అర్హుడన్నారు. జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకుల ఏకాభిప్రాయంతోనే బొత్సను పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేశారన్నారు. మా పార్టీలో లేని బాధ, అభ్యంతరాలు టీడీపీ, జనసేన, ఎల్లోమీడియాకు ఎందుకన్నారు. బొత్స స్థానికేతరుడంటూ వీరు చేస్తున్న విమర్శలు గురివింద గింజను తలపిస్తున్నాయన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కడప జిల్లాకు చెందిన వ్యక్తి అని, విశాఖసిటీలో ఎమ్మెల్యే వెలగపూడి కృష్ణా జిల్లా కు చెందిన వ్యక్తి కాగా, వంశీకృష్ణ శ్రీనివాస్ నెల్లూరుకు చెందిన వాడన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా మంత్రిగా పనిచేసిన గంటా శ్రీనివాసరావుది ప్రకాశం జిల్లా అని అన్నారు. అలాగే పురంధరేశ్వరిది ప్రకాశం జిల్లా కాగా, ఎంపీ భరత్ రాజమండ్రి ప్రాంతానికి చెందినవారన్నారు. విష్ణుకుమార్‌రాజు కూడా ఈ జిల్లాకు చెందిన వారు కాదన్నారు. ప్రస్తుతం టీడీపీ కూటమిలో పదవుల్లో ఉన్నవారంతా స్థానికేతరులే అని, ఈ విషయాన్ని మర్చిపోయి కూటమి నేతలు సిగ్గు లేకుండా విమర్శలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు అవసరమైన సంఖ్యా బలం టీడీపీకి లేదన్నారు. 600 పైచిలుకు స్థానాలు వైఎస్సార్‌సీపీకే ఉన్నాయన్నారు. తమ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు. ఎమ్మెల్సీ స్థానాన్ని దొడ్డిదారిలో గెలుపొందాలనే ఉద్దేశ్యంతోనే తమ పార్టీ నుంచి గెలుపొందిన కార్పొరేటర్లను టీడీపీ, జనసేన నాయకులు సిగ్గు లేకుండా తమ పార్టీలో చేర్చుకుంటున్నారన్నారు. చంద్రబాబుకు వెన్నుపోటు రాజకీయాలు కుట్రలు, అడ్డదారిలో పదవులు అనుభవించడం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. గతంలో కడప ఎమ్మెల్సీ స్థానాన్ని సంఖ్యా బలం లేకపోయినప్పటికీ అక్కడ ఎంపీటీసీలు, కార్పొరేటర్లను డబ్బులు ఇచ్చి సంతలో పశువుల్లా కొనుగోలు చేసి గెలుచుకున్నారన్నారు. ఇక్కడ కూడా అదే ప్రయత్నాలకు తెరతీస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా బొత్స విజయం ఖాయమన్నారు. దమ్ముంటే ఎల్లో మీడియా ప్రస్తుతం టీడీపీలో పదవుల్లో ఉన్నవారి స్థానికతపై కథనాలు ప్రచురించాలని సవాల్ విసిరారు.

చీమలపాడు గిరిజన యువకుడి అదృశ్యం

- కల్యాణపులోవ రిజర్వాయరులో గల్లంతైనట్టు భావించి గాలింపు
- కేసు నమోదు చేసిన పోలీసులు



అదృశ్యమైన చిన అప్పారావు



కల్యాణపులోవ రిజర్వాయరులో వెతుకుతున్న ప్రత్యేక బృందం

చోడవరం : రావికమతం మండలం చీమలపాడు పంచాయతీకి చెందిన గిరిజన యువకుడు అదృశ్యమైనట్టు ఎస్‌ఐ లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. యువకుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు. అయితే అదృశ్యమైన గిరిజన యువకుడు ఈదల చినఅప్పారావు ఎలియాస్ సంజీవి 35 తరుచూ సమీపంలో ఉన్న కల్యాణపులోవ రిజర్వాయరులో చేపల వేటకు వెళ్లేవాడని తెలిసిందన్నారు. ఆయన వాడే బోటు, ఇతర చేపల వేటకు ఉపయోగించే పరికరాలు రిజర్వాయరులో కనిపించాయని ఎస్‌ఐ చెప్పారు. దీంతో చేపలవేట చేస్తూ రిజర్వాయరులో గల్లంతై ఉంటాడని భావిస్తున్నామని, గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సాయంతో వెతకడం ప్రారంభించామని తెలిపారు. వివరాలివి. చీమపాడు పంచాయతీ శివారు దూకులంపాడు గ్రామానికి చెందిన ఈదల చిన అప్పారావు శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అప్పటి నుంచి ఆదివారం వరకూ ఇంటికి రాకపోవడంతో అతని సోదరి దోని గడ్డమ్మ రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుతో పోలీసులు గాలింపు ప్రారంభించారు. చినఅప్పారావు తరుచూ కల్యాపులోవ రిజర్వాయరులో చేపల వేట చేస్తుంటాడు. ఆయన ఉపయోగించే నాటు బోటు, చేతికత్తి, ఇతర వేట సామాగ్రి జలాశయం వద్ద లభించినట్టు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. దీంతో జలాశయంలో గల్లంతై ఉంటాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, ఇప్పటికే ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో ఆదివారం సాయంత్రం వరకూ వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సమాచారం అందించామని, వారి సూచన మేరకు అవసరమైతే ఎన్‌డీఆర్‌ఐ బృందంతో జలాశయంలో వెతికిస్తామని ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి



కడవల అంజలి (ఫైల్)

రాంబిల్లి (యలమంచిలి) : వివాహిత అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామంలో శనివారం సాయత్రం చోటు చేసుకుంది. ఈ ఘటనపై రాంబిల్లి సీఐ సిహెచ్ నర్సింగరావు తెలిపిన వివరాలివి. మండలంలో కృష్ణంపాలెం గ్రామానికి చెందిన ఇల్లా దుర్గ భార్య కడవల అంజలి శనివారం తన ఇంట్లో అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. పరవాడ మండలం పి.భోనంగి గ్రామానికి చెందిన కడవల అంజలిని (20) గత ఏడాది కృష్ణంపాలెం గ్రామానికి చెందిన ఇల్లా దుర్గ ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాది వయస్సు ఉన్న పాప ఉంది. శనివారం సాయంత్రం ఆమె తమ ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొంది. ఆమె భర్త ఇల్లా దుర్గ గత కొంత కాలంగా తను చేస్తున్న ఉద్యోగం మానేసి ఇంటిలో ఖాళీగా ఉండడం, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడం కారణంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకొన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం తన భార్య అంజలి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందినట్టు దుర్గ అంజలి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో తెలిపాడు. సమాచారం తెలుసుకొన్న ఆమె తల్లి చిట్టెమ్మ, బంధువులు ఘటనా స్థలానికి వచ్చి భోరున విలపించారు. తమ కుమార్తె ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుందా లేక వేధింపుల వల్ల చనిపోయిందా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతురాలి తల్లి రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాంబిల్లి సీఐ సిహెచ్ నర్సింగరావు తెలిపారు.

ఆర్‌టీసీ బస్సు, బైక్ ఢీకొని ఒకరు మృతి



ఘటనా స్థలంలో మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నాతవరం: నర్సీపట్నం తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఎం.బెన్నవరం గ్రామ సమీపంలో రెండవ మలుపు వద్ద ఆర్‌టీసీ బస్సు, బైక్ ఢీకొన్న సంఘటనలో లగుడు అప్పలనాయుడు (60) అక్కడికక్కడే మృతిచెందాడు. నాతవరం ఎస్‌ఐ రామారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం మండలం అమలాపురం గ్రామానికి చెందిన లగుడు అప్పలనాయుడు ఆదివారం ఉదయం బైక్‌పై నర్సీపట్నం బయలుదేరాడు. మార్గమధ్యంలో నర్సీపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అప్పలనాయుడు సంఘటన స్థలంలోనే మరణించాడు. మృతుడు అప్పలనాయుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు పెద్ద కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు నాతవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఆర్‌టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా ఎం.బెన్నవరం గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు మలుపులో తరుచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఇక్కడ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వరి నారుమడిలో ఉల్లికోడు తెగులు

అనకాపల్లి : ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరి నారుమడిలో ఉల్లికోడు తెగులు వచ్చే అవకాశం ఉన్నందున, నివారణకు కార్బొఫ్యురాన్ 3 జి గుళికలను సెంటుకు 160 గ్రా.ల చొప్పున వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాపరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. నారుమడి నాటుకోవడానికి సిద్ధంగా ఉంటే, ఈ వర్షాలను ఉపయోగించుకొని, పచ్చిరొట్ట పైరును నేలలో కలియ దున్ని ప్రధాన పొలం తయారు చేసుకోవాలన్నారు.

నాట్లు వేసుకునేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు...

నాట్లు వేసుకునే రైతులు ఆకు చివరలను తుంచి 20 ఇన్‌టూ 15 సెం.మీ. దూరంలో కుదురుకు 2-3 మొక్కల చప్పున నాటుకోవాలని, ఖరీఫ్‌లో చ.మీ.కు. 33 మూనలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ.బాటలు తియ్యడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడ పీడల ఉధృతి కొంత వరకు అదుపు చేయవచ్చని, ఎరువులు, కలుపు మందులు, పురుగు మందులు వేయడానికి ఇంకా పైరు పరిస్థితి గమనించడానికి ఈ బాటలు బాగా ఉపయోగ పడతాయని అన్నారు. ఎకరాకు 35 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సువర్ ఫాస్పేట్ 17 కిలోల మురేట్ ఆఫ్ పోటాష్ నాట్లు వేసుకునేటప్పుడు వేసుకోవాలని, ఎకారాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని, జింక్ సల్ఫేట్ వేసినప్పుడు భాస్వరం ఎరువులతో కలపకుండా కనీసం మూడు రోజుల వ్యవధి ఉండేలా చూసుకోవాలని సూచనలు చేశారు.

కలుపు నివారణ ఇలా...

వర్షాల కారణంగా కలుపు సమస్య పెరిగే అవకాశం ఉందని, నివారణకు, ఎకారాకు 500మి.లీ. ప్రీటిలక్లోర్ లేదా 35 గ్రా. ఆక్సాడయార్జిల్ మందును 500 మి.లీ. నీటిలో కలిపి, ఆ ద్రవాన్ని ఎకరాకు 20 కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన 3-5 రోజుల్లో పలుచగా నీరు ఉంచి సమానంగా వెదజల్లాలన్నారు. పైరజోసల్ఫ్యూరాన్ కలుపు మందును ఎకరానికి 80-100 గ్రా.చొప్పున వరి నాటిన 8-12 రోజులకు బిస్పైరిబాక్ సోడియంను ఎకరానికి 100 మి.లీ.ల చొప్పున వరి నాటిన 15-20 రోజులప్పుడు పిచికారి చేసి కలుపు నివారించవచ్చన్నారు.

రాగి నాటుకోవాలంటే...

రాగల ఐదు రోజులలో వర్ష సూచన ఉన్నందున రైతులు వర్షాన్ని ఉపయోగించుకుని చోడి (రాగి)ని నాటుకొనే రైతులు స్వల్ప కాలిక రకాలైతే 15 ఇన్‌టూ 10 సెం, మీ, మధ్య కాలిక రకాలైతే 15-20 ఇన్‌టూ 15 దూరం లో నాటుకోవాలని, రాగి పైరును నాటుకునే రైతులు ఎకరాకు టన్నుల పశువుల ఎరువును వేసి ఆఖరు దుక్కిలో కలియదున్నాలని, ఎకరాకు 26 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 13 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను నాటేటప్పుడు వేసుకోవాలన్నారు.

నూకాంబికకు ప్రత్యేక పూజలు

- ఆషాఢ అమావాస్య సందర్భంగా పోటెత్తిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో గౌరీపూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రధాన అర్చకుడు సత్యనారాయణ శర్మ



అన్నప్రసాద వితరణలో భాగంగా భక్తులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

యలమంచిలి రూరల్: ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలోని బస్‌కాంప్లెక్స్ సమీపంలో ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే ఆలయ ప్రధాన అర్చకుడు బిక్కవిల్లి సత్యనారాయణ శర్మ, సహాయ అర్చకుడు రామకృష్ణ అమ్మవారికి పసుపు జలంతో మంగళ స్నానం చేయించారు. అనంతరం అష్టోత్తరశతనామార్చన శాస్త్రోక్తంగా జరిపించారు.తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆషాఢమాసం చివరిరోజు,ఆదివారం అమావాస్య కావడంతో పట్టణంలోని వివిధ ప్రాంతాలు,చుట్టుపక్కల గ్రామాల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. సాయంత్రం దుర్గాపూజ, పచామృతాభిషేకం, అష్టోత్తర పూజ చేశారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు శ్రీరాములు,గంధం శివ,స్వయం సేవకురాలు కృష్ణవేణి(భవానీ) తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భారీ ఎత్తున అన్న సమారాధన

మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సుమారు రెండు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి నెల అమావాస్యరోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను పలువురు ఈ సందర్భంగా అభినందించారు.కార్యక్రమం నిరాటంకంగా కొనసాగాలంటూ పలువురు దాతలు విరాళాలు అందజేశారు.

యువతుల గౌరీ పూజలు

ఆషాఢ అమావాస్య సందర్భంగా ఆదివారం పలుచోట్ల ఆలయాల్లో వివాహం కాని యువతులు భక్తిశ్రద్ధలతో గౌరీపూజలు నిర్వహించారు.కొందరు తమ ఇళ్ల వద్దే పసుపు ముద్దను గౌరీదేవిగా భావించి పూజించారు. బియ్యపు కుడుములను నైవేద్యంగా పెట్టారు.అనంతరం రక్షను ధరించారు. ఉదయం గౌరీ పూజ చేసి,సాయంత్రం వరకు నిష్టగా ఉపవాసాన్ని ఆచరించారు. కొన్ని ఆలయాల ప్రాంగణంలో దీపపు పూజలు నిర్వహించారు.

'మహార్ణవం' లఘు కవితా సంపుటి ఆవిష్కరణ



మహార్ణవం లఘుకవితా సంపుటి ఆవిష్కరిస్తున్న ఎం. రామకృష్ణ, సాహితీ అభిమానులు

తుమ్మపాల : సామాజిక స్పృహతో రాసేవారే నేటి సమాజానికి కావాల్సిన కవి, కవిత్వం, సాహిత్యం అని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం.రామకృష్ణ అన్నారు. పట్టణంలో శాఖా గ్రంథాలయంలో సాహితీ సురేఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్ రచించిన మహార్ణవం అనే లఘు కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన తొలుత గ్రంథాన్ని ఆవిష్కరించి, శ్రీశ్రీ మహా ప్రస్థానాన్ని మహార్ణవం గుర్తు చేస్తుందన్నారు. సామాజిక రుగ్మతలు, అవినీతి అక్రమాలపై కవి కలమనే కరవాలంతో చీల్చి చెండాడారని అన్నారు. ప్రముఖ కథకులు, కవి రంగబాబు పుస్తక సమీక్ష చేశారు. విశిష్ట అతిథి హిందీ ఉపాధ్యాయులు కొణతాల జగన్ నేటి సమాజానికి సాహిత్య ఆవశ్యకతను తెలిపారు. సాహితీ సురేఖ సంస్థ గతంలో వలే పలు సాహితీ కార్యక్రమాలకు రూపకల్పన చేయనున్నదని పేర్కొంటూ గ్రంథాలయానికి సంస్థ మెగా మైక్‌ను వితరణగా ప్రకటించారు. మల్లారెడ్డి శంకరప్రసాద్, బల్లా నాగభూషణం, దివా కర్, మాధవీ సనారా, గంటా గోవింద్, సురేష్ బాబు, చిన్నారావు, మల్లేశ్వరరావు, స్ఫూర్తి శివాజీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు పార్టీ నియోజకవర్గ విస్తృత సాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, అనకాపల్లి, కశింకోట మండల పార్టీల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్‌, మలసాల కిషోర్‌కుమార్‌లు ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్‌ విచ్చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరు కావాల్సిందిగా పిలుపునిచ్చారు.

బీమాతో కుటుంబ ఆర్థిక పురోగతి



ఎల్‌ఐసీ కార్యాలయం ఆవరణలో మొక్కను నాటుతున్న కర్రి హరగోపాల్‌

అనకాపల్లి: జీవిత బీమా ఆర్థిక ఎదుగుదలతోపాటు, కుటుంబానికి అత్యవసర సమయాల్లో ఎంతో ఆసరాగా ఉంటుందని జాతీయ బీమా కార్మిక సంఘం(ఎన్‌ఐవోడబ్ల్యూ) జాతీయ ఎగ్జిక్యూటివ్‌ కమిటీ సభ్యుడు బొడ్డేడ అప్పలనరసయ్య అన్నారు. స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయ ఆవరణలో జాతీయ బీమా కార్మిక సంస్థ 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఎల్‌ఐసీ అనకాపల్లి శాఖ అసిస్టెంట్‌ మేనేజర్‌ కర్రి హరగోపాల్‌ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐసీ సంస్థ అభివృద్ధి కోసం కార్మికులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులకు మెడికల్‌ రీయింబర్స్‌మెంట్‌, రిటైర్‌మెంట్‌ పెన్షన్‌తో పాటు, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవుల్ని మూడు మాసాల నుంచి ఆరు మాసాలకు పెంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ బీమా కార్మిక సంఘం నాయకులు ఎం.జగదీష్‌, కేవీ శ్రీనివాస్‌, ఏజెంట్లు పాల్గొన్నారు.

నేటి నుంచి కోటి కుంకుమార్చన

అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణపూరం పంచాయతీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి కోటి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు యర్ర త్రినాథరావు, ధర్మకర్త బోయిన రమణాజీలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు భక్తులచే ఈ కుంకుమార్చన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. శ్రావణమాసం నాలుగు వారాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

అనకాపల్లి సినిమాలు

శివం భజే	: రాజా
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్‌-1
బడ్డీ	: సత్యనారాయణ స్క్రీన్‌-2
అలనాటిరామచంద్రుడు	: పర్తిసాయి
డార్లింగ్‌	: షిర్డిసాయి
తిరగబడరస్వామి	: వెంకటేశ్వర
పురుషోత్తముడు	: శ్రీసత్య
ఉషాపరిణయం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్‌ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్‌-4 యూనిట్లు, బీ పాజిటివ్‌-11 యూనిట్లు, ఓ పాజిటివ్‌-22 యూనిట్లు, ఏబీ పాజిటివ్‌-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌ బ్యాంకు టెక్నీషియన్‌ యు.లోకేష్‌ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్‌ సమాచారం

అనకాపల్లి: ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ ద్వారా ఆదివారం 215 మంది గ్యాస్‌ బుక్‌ చేసుకున్నారు. గతంలో బుక్‌ చేసుకున్న వారిలో 106 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్‌ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

కూటమి కుట్ర.. మారిన తర‘గతి’

- ఆంగ్ల మాధ్యమంపై దుష్ప్రచారంతో తగ్గిన విద్యార్థులు
- ఎండీఎం నిర్వాహకులపైనా రాజకీయ కక్ష సాధింపులు
- చాలా స్కూళ్లలో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

‘నువ్వు దంచుతూ ఉండు.. నేను పక్కలెగరేస్తాను’ అన్నట్టుంది కూటమి ప్రభుత్వ తీరు. గత ప్రభుత్వం విద్యాభివృద్ధికి వెచ్చించిన నిధులతో వీళ్లు గొప్పలు చెప్పుకోవడం తప్ప, కొత్తగా పైసా నిధులు విదిల్చే లక్షణాలు కనిపించట్లేదు. పైపెచ్చు దేశ వ్యాప్తంగా మెచ్చిన విద్యా విధానాన్ని నానాటికీ దిగజార్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బయటకు మాత్రం విద్యావ్యవస్థను ఉద్ధరించేస్తామన్నట్లు మాటలు చెప్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అనకాపల్లి నియోజకవర్గ పరిధిలో విద్యా అవస్థలు మొదలయ్యాయి.

తుమ్మపాల/కశింకోట: కూటమి ప్రభుత్వంలో విద్యారంగం కుదేలవుతోంది. గత ప్రభుత్వ ప్రాధాన్యతల్ని పూర్తిగా తుంగలో తొక్కేశారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం సమకూర్చిన విద్యార్థి కిట్లు(విద్యా కానుక), రుచికరమైన భోజనం పెట్టేలా మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం), ఆంగ్ల మాధ్యమం అమలు తదితర అంశాల్ని ఒక్కొక్కటిగా నీరుగార్చుతున్నారు. ఏళ్ల తరబడి వండి వడ్డిస్తున్న ఎండీఎం నిర్వాహకుల్ని తొలగించి, తమ అనుయాయులకు కేటాయించి కొత్త దందాకు తెరతీస్తున్నారు. అనకాపల్లి నియోజకవర్గ పరిధిలోని చాలా స్కూళ్లలో ఇప్పుడు ఇదే పరిస్థితి నెలకొంది.

వేధిస్తున్న టీచర్ల కొరత

అనకాపల్లి మండలం, పట్టణంలో ఎంపీపీఎస్‌, ఎంపీఎల్‌, ఎంపీయూపీ, జెడ్పీ, మున్సిపల్‌ యాజమాన్యాల్లో మొత్తం 107 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. జిల్లా పరిషత్‌ పాఠశాలలు మినహా 195 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట తాత్కాలిక పద్ధతిలో ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేశారు.



తుమ్మపాల: ఒకే తరగతి గదిలో 4, 5 తరగతుల విద్యార్థులు

- కశింకోట మండలంలో 43 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 10 జిల్లా పరిషత్‌ హైస్కూళ్లు, తేగాడలో మోడల్‌ స్కూల్‌, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, తాళ్లపాలెంలో ఏపీ బాలికల గురుకుల పాఠశాల కలిపి మొత్తం 59 స్కూళ్లు ఉన్నాయి. వీటిలో 4,753 మంది విద్యార్థులు చదువుతున్నారు.
- కశింకోటలోని బాలికల హైస్కూల్లో 736 మంది చదువుతున్నారు. 3 నుంచి 5వ తరగతి వరకు ఒక్కొక్క సెక్షన్‌, 6 నుంచి 10వ తరగతి వరకు 15 సెక్షన్లు నిర్వహిస్తున్నారు. ఇక్కడ సరిపడినంత మంది ఉపాధ్యాయులు లేరు. వీరందరికి ఒక్కరే హిందీ టీచర్‌. బయాలజీ పోస్టు ఒకటి ఖాళీగా ఉంది. గణితం, ఫిజిక్స్‌ సబ్జెక్టులకు ముగ్గురేసి టీచర్లున్నా, అదనంగా చెరొక్కరు చొప్పున నియమించాల్సి ఉంది.



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకురాలు

3, 4, 5 తరగతులకు కూడా ఉన్న ఉపాధ్యాయులే సర్దుబాటు చేసుకుని పాఠాలు బోధిస్తున్నారు.

- జమాదులపాలెంలో ఫిజికల్‌ డైరెక్టర్‌ లేరు.
- బయ్యవరం హైస్కూల్లో సోషల్‌ సబ్జెక్టుకు మరో ఉపాధ్యాయుని అవసరం ఉంది.
- ఆదర్శ పాఠశాలలో సైన్స్‌, ఇంగ్లిష్‌ పోస్టులు ఒక్కొక్కటి ఖాళీగా ఉన్నాయి.
- కొత్తపల్లి హైస్కూల్లో గణితం ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉంది.

తగ్గిన ప్రవేశాలు

అనకాపల్లి మండలంలో 2023–24 విద్యాసంవత్సరంలో 10,150 మంది ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సంఖ్య 8,939 మందికి తగ్గింది. ఆంగ్ల మాధ్యమంపై అపోహలు, పాఠశాల నిర్వహణలో పర్యవేక్షణ కొరవడటం తదితర కారణాలతో 1,211 మంది ప్రభుత్వ పాఠశాలల్ని వీడి ప్రైవేట్‌ స్కూళ్లలో చేరిపోయారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వంలో ఇంగ్లిష్‌ మీడియం కొనసాగించరనే భయంతోనే ప్రైవేట్‌ స్కూళ్లకు మారిపోయినట్లు తల్లిదండ్రులు చెప్తున్నారు. కశింకోట మండలంలోనూ ఇదే పరిస్థితి.



ఒకటో తరగతిలో ఒక్కరూ లేరు!

కశింకోటలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది విచిత్ర పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థీ చేరలేదు. పక్కనే హైస్కూల్‌ ఉండటంతో 3–5 తరగతులు విలీనమయ్యాయి. ఇక్కడ ఒకటి, రెండు తరగతులకు మాత్రమే బోధన జరుగుతోంది. గతేడాది ఒకటో తరగతిలో ఉన్న విద్యార్థులు 21 మంది రెండో తరగతికి వెళ్లారు. ఒకటో తరగతికి ఒక్క విద్యార్థీ లేకపోవడంతో ఇక్కడ ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులూ ఒకే తరగతి గదిలో ఉంటూ బోధన కొనసాగిస్తున్నారు.

ఎండీఎం నిర్వాహకులపై కక్ష సాధింపు

అనకాపల్లి మండలంలోని గొలగాం మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో 15 ఏళ్లుగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా విద్యార్థులకు రుచికరంగా, పరిశుభ్రంగా మధ్యాహ్న భోజనం అందిస్తున్న నిర్వాహకురాలు మునగపాక ఈశ్వరమ్మను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆమె కోడలు భారతి గ్రామ వలంటీర్‌గా పనిచేయడమే దీనికి కారణం. ఆమె స్థానంలో టీడీపీ కార్యకర్త భార్యను నియమించారు. పట్టణంలోని గవరపాలెం ఎంపీపీ స్కూల్లో కూడా పాత నిర్వాహకురాల్ని తొలగించి టీడీపీ కార్యకర్త కుటుంబ సభ్యురాలికి కేటాయించారు.

సమష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ



సత్యనారాయణ కొండ వద్ద వివిధ రకాల పండ్ల విత్తనాల విత్తన బంతులతో గ్రీన్‌ క్లబ్‌ సభ్యులు

అనకాపల్లి: భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రీన్‌ క్లబ్‌ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌ శ్రీధర్‌ అన్నారు. మండలంలోని సత్యనారాయణపురం సత్యనారాయణస్వామి కొండ సమీపంలో గ్రీన్‌క్లబ్‌, విశాఖ గ్రీన్‌ క్లైమేట్‌ అండ్‌ వనమాలి గార్డెనర్స్‌ గ్రూప్‌ ఆధ్వర్యంలో ఆదివారం విత్తన బంతులు విసిరే కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యులంతా వేర్వేరు చోట్ల 2 వేల విత్తన బంతుల్ని విసిరారు. ఈ సందర్భంగా ఫణిభూషణ్‌ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం బంకమట్టి, సేంద్రియ ఎరువు మిశ్రమంలో ఉసిరి, వేప, నేరేడు, పనస, చింత, అశోక, సపోటా తదితర విత్తనాలను కలిపి వెదజల్లినట్లు తెలిపారు. మొక్కలను నాటి వాటి పర్యవేక్షణను కూడా బాధ్యతగా తీసుకోవాలన్నారు. పోషకాలు అధికంగా ఉండే మట్టిలో విత్తనాలను పెట్టడం వలన బతికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్‌ సీనియర్‌ సభ్యులు బీరా వినోద్‌కుమార్‌, ఎస్‌ఎఫ్‌ఐ సత్యనారాయణ, వంకాయల ఈశ్వరరావు, బేతాళం శేషసాయి, కొడమంచలి సుందరశ్రీను, సత్తిబాబు, సురేష్‌, ఆర్‌.అనిత, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల గోడ పత్రిక ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దుర్గభ కృష్ణప్రేమ్‌దాస్‌

అనకాపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు జగన్నాథస్వామి ఆలయ ప్రతినిధి దుర్గభ కృష్ణప్రేమ్‌దాస్‌ తెలిపారు. జాతీయ రహదారి జలగలమదుం సమీపంలోని హరే కృష్ణ సత్సంగ్‌ ఆధ్వర్యంలో జన్మాష్టమి వేడుకల గోడపత్రికలను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 25న ఉట్టి ఉత్సవం, 26న సాయంత్రం 5 గంటలకు ఊంజల్‌ సేవ, రాత్రి 7 గంటలకు శ్రీకృష్ణలీలామృతం ప్రవచనం, 8 గంటలకు శ్రీరాధా గిరిధారి భగవానునికి పంచామృత మహాకలశాభిషేకం, 27న ఉదయం 10 గంటలకు ప్రభుపాదుల వారికి మహా అభిషేకం, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాలు జరపనున్నట్లు వెల్లడించారు.

రోటరీ క్లబ్‌ విస్తరణకు కార్యాచరణ



రోటరీ క్లబ్‌ జిల్లా గవర్నర్‌ వెంకటేశ్వరరావుతో క్లబ్‌ సభ్యులు



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: ప్రపంచ వ్యాప్తంగా రోటరీక్లబ్‌ విస్తరణలో భాగంగా కొత్త సభ్యుల్ని చేర్చుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు రోటరీ క్లబ్‌ జిల్లా గవర్నర్‌ (విజయనగరం) వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్‌ హాల్లో రోటరీ జిల్లా స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాల ద్వారా కొత్త సభ్యులను చేర్చుకునేందుకు కమిటీ కృషి చేయాలని కోరారు. అంతకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అనకాపల్లి మెంబర్‌షిప్‌ చైర్మన్‌ బుద్ద రమణాజీ, కోచైర్మన్‌ కడిమిశెట్టి సతీష్‌, అసిస్టెంట్‌ గవర్నర్‌ కాండ్రేగుల మురళి, జిల్లా ఫౌండేషన్‌ ప్రతినిధి పద్మనాభం రాజేశ్వర్‌ ప్రసాద్‌, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌ రూల్స్‌పై అవగాహన



ఆటో డ్రైవర్లు, యూనియన్‌ నాయకులతో మాట్లాడుతున్న ట్రాఫిక్‌ సీఐ పైడపు నాయిడు

అనకాపల్లి: ట్రాఫిక్‌ నిబంధనలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లంతా కృషి చేయాలని ట్రాఫిక్‌ సీఐ పైడపు నాయుడు కోరారు. స్థానిక ఎన్టీఆర్‌ బెల్లం మార్కెట్‌ యార్డు ఆవరణలో పట్టణ పరిధిలోని ఆటో యూనియన్‌ నాయకులు, డ్రైవర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు వాహనాలు నడిపినప్పుడు తప్పనిసరిగా వారి వెంట డ్రైవింగ్‌ లైసెన్స్‌, వాహన రికార్డులు తీసుకువెళ్లాలని సూచించారు. ట్రాఫిక్‌ రూల్స్‌ను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, ఆటోలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు ఎక్కినట్లు గమనిస్తే, దగ్గరలోని పోలీస్‌ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

జి.భీమవరంలో పారిశుధ్య నిర్వహణ



వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్‌ చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

కశింకోట: మండలంలోని జి.భీమవరం, శివారు సింగవరం గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్తా, చెదారం శుభ్రపరిచారు. దోమల నివారణకు ఫాగింగ్‌ చేశారు. సర్పంచ్‌ హనుమంతు వెంకట లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి బి.చిన్నోడుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం

- ఊరూవాడా సందడిగా స్నేహితుల దినోత్సవం



బెస్ట్‌ ఫ్రెండ్స్‌క్లబ్‌ లాంగ్‌ వాకింగ్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ట్రాఫిక్‌ సీఐ పైడపు నాయుడు



ఎన్టీఆర్‌ వైద్యాలయంలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్‌ సభ్యులు



ఎన్టీఆర్‌ క్రీడామైదానంలో సీనియర్‌ వాకర్‌ యడ్ల త్రినాథ్‌ను శాలువాతో సత్కరిస్తున్న వాకర్స్‌



వెయ్‌.. చిందెయ్‌: గవరపాలెం చిన్నహైస్కూల్‌ 1991-92 బ్యాచ్‌ టెన్త్‌ విద్యార్థుల ఆనందోత్సాహం

అనకాపల్లి: పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్నాపెద్దా తేడా లేకుండా అంతా ఆనందంగా గడిపారు. మిత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ, స్నేహమాధుర్యాన్ని పరస్పరం పంచుకున్నారు.

- పట్టణంలో బెస్ట్‌ ఫ్రెండ్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సమేతంగా సందడి చేశారు. స్థానిక రింగ్‌రోడ్డులో బెస్ట్‌ ఫ్రెండ్స్‌ క్లబ్‌ కుటుంబ సభ్యులు మూడు విభాగాలుగా లాంగ్‌ వాకింగ్‌ చేశారు. పట్టణ సీఐ పైడపునాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జీవితంలో స్నేహం ఎంతో గొప్పదన్నారు. క్లబ్‌ సభ్యులు ఎన్టీఆర్‌ వైద్యాలయంలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు విశాఖ జబర్దస్త్‌ టీం వారిచే హాస్యామృతం కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్‌ అధ్యక్షుడు బీఎస్‌ఎంకే జోగినాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్‌, కోశాధికారి భరిన్కాన శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, చైర్మన్‌ పి.ఎస్‌.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.
- ఎన్టీఆర్‌ క్రీడామైదానం వాకర్స్‌ సభ్యులు స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడామైదానంలో వాకర్స్‌ గౌరవాధ్యక్షుడు యడ్ల త్రినాథ్‌ను శాలువాతో సత్కరించారు. వాకర్స్‌ రామకృష్ణ, ఓం నమఃశివాయ, అప్పారావు, కిశోర్‌, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక జార్జిక్లబ్‌ ఆవరణలో షటిల్‌ హట్‌ సభ్యులు కుల, మతాలకు అతీతంగా స్నేహబంధం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్‌ సభ్యుడు డాక్టర్‌ కె.విష్ణుమూర్తి కేక్‌ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో దంతులూరి దిలీప్‌కుమార్‌, కొణతాల మురళీకృష్ణ, బుద్ద కాశీవిశ్వనాథం, దాడి ఈశ్వరరావు, ఆళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.
- గవరపాలెం చిన్నహైస్కూల్‌ 1991–92 టెన్త్‌ బ్యాచ్‌ పూర్వ విద్యార్థులు తోటాడరోడ్డులోని కాండ్రేగుల నాయుడు లేఅవుట్‌లో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్‌ కట్‌చేసి డ్యాన్సులు వేశారు. కోవిడ్‌ సమయంలో మృతిచెందిన దొడ్డి ఉమ కుటుంబ సభ్యులకు రూ.50 వేలు నగదును విల్లూరి పరమేశ్వరరావు ద్వారా అందించారు. కార్యక్రమంలో కాండ్రేగుల జగన్నాథరావు, కొణతాల అప్పలరాజు, పీలా రాముడు, గంగాధర్‌, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.
- కుశలమా మిత్రమా సినిమా సంస్థ ఆధ్వర్యంలో సత్యనారాయణపురం కొండ వద్ద జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌ 1985–86 టెన్త్‌ బ్యాచ్‌ పూర్వ విద్యార్థు ఆత్మీయ కలయిక జరిగింది. పూర్వ విద్యార్థి అదట్ర శ్రీనివాసరావు ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కు అందించారు. డిసెంబర్‌లో అనకాపల్లి స్మార్ట్‌ సిటీ టీం ఆధ్వర్యంలో 10 వేల మందితో రన్‌ నిర్వహించేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో కుశలమా మిత్రమా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పి.ఎల్‌.నారాయణ, కోశాధికారి పలకా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జార్జి క్లబ్‌లో స్నేహితుల దినోత్సవ కేక్‌ కట్‌చేసి పంపిణీ చేస్తున్న విష్ణుమూర్తి



అదట్ర శ్రీను కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కును అందిస్తున్న కుశలమా మిత్రమా బృందం

గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం

మునగపాక: మండలంలోని మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి దాతలు తమవంతు విరాళం అందజేస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మునగపాకకు చెందిన స్వర్గీయ డాక్టర్‌ పెంటకోట జోగినాయుడు కుమారులు జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, అతని సోదరుడు వెంకట జోగి అప్పలనాయుడులు రూ.10,155 నగదు అందజేశారు. సర్పంచ్‌ బీశెట్టి గంగప్పలనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలనే తయారు చేయాలి



చవితి పూజకు మట్టి విగ్రహాలనే తయారుచేయాలని వినతి పత్రాలు అందిస్తున్న కుమారస్వామి

తుమ్మపాల: సెప్టెంబర్‌ 7న వినాయక చవితి సందర్భంగా ప్రజలంతా మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలనే వినియోగించాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్‌ ఆడారి కుమారస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు మట్టి వినాయక ప్రతిమలనే తయారుచేయాలంటూ పట్టణంలోని పలు వినాయక విగ్రహ తయారీదారులకు ఆదివారం వినతి పత్రాలు అందించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్లాస్టర్‌ ఆఫ్‌ పారిస్‌ విగ్రహాలను తయారుచేయవద్దని కోరారు. గణపతిని క్రియేటివిటీ పేరిట అభ్యంతరకర రూపాల్లో కూడా చూపించరాదన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



తాళ్లపాలెం హైస్కూల్‌ 2002-03 టెన్త్‌ బ్యాచ్‌ పూర్వ విద్యార్థులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్లో చదివిన 2002–03 బ్యాచ్‌ టెన్త్‌ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం వేడుకగా జరిగింది. చాన్నాళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు గుర్తుపట్టి, పలకరించుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఎస్‌టీపీ ఆచారి, పండరీబాయి, నాగేశ్వరరావు, సాయిబాబు, ఎల్‌ఎస్‌ఎస్‌ పాత్రుడు, లక్ష్మిలను సత్కరించి పాదపూజ చేసి, ఆశీస్సులు అందుకున్నారు. సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిగా గడిపారు. జ్ఞాపకాలను సెల్‌ఫోన్లలో భద్రపరచుకుని ఆనందంగా తిరుగుముఖం పట్టారు. పూర్వ విద్యార్థులు జట్ల రాజేష్‌, కుందెం గణేష్‌, రమేష్‌, మల్లెపు గోపి, గణేష్‌ పాల్గొన్నారు.